# వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, జూన్19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు సేవ కొనసాగించారు. తూర్పునకు అభీష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నరపాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలు తెల్లవారుజామునే ప్రారంభమయ్యాయి. ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి స్వామి, అమ్మవార్లకు బాలభోగం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుఢ, తిరుచ్చీ వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢవీధుల్లో సేవను ఊరేగించారు. రాత్రి దర్బార్ సేవ, రాత్రి నివేదన, శయనోత్సవం నిర్వహించారు. స్పటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం సుమారు గంటన్నరపాటు జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడికి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 16 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.23,88,958 ఆదాయం సమకూరినట్లు ఈఓ ఎన్. గీత తెలిపారు.


యాదగిరిగుట్ట ఆలయ మాఢవీధుల్లో స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవోత్సవం

### స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు..

లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, ఏపీ ఐఏఎస్ అధికారి వెంకటరామిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ పర్యవేక్షకుడు రాజన్‌బాబు స్వామి వారి ప్రసాదం అందజేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో హరితహారం నిర్వహించారు. ఆలయ ఈఓ గీత, డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, ఏఈఓలు రమేశ్‌బాబు, శ్రవణ్‌కుమార్, రఘు, అధికారులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది కలిసి కొండకింద మొదటి ఘాట్ రోడ్డు వద్ద మొక్కలు నాటారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఐలు జాతీయ కార్యదర్శి సురేంద్రనాథ్ పిలుపు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేయాలని ఐలు జాతీయ కార్యదర్శి సురేంద్రనాథ్ సూచించారు. ఐలు రాష్ట్ర మహాసభల అనంతరం సోమవారం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించి మాట్లాడారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి సమస్య సాధించే దిశగా పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ చట్టాలను సాధించుకునేలా తమ కార్యాచరణ ఉండాలని అన్నారు. మహాసభల్లో చేసిన తీర్మానాలు రాష్ట్రంలో అడ్వకేట్ రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు 10,000 స్టైఫండ్ ఇవ్వాలని, డెత్ బెనిఫిట్‌ను 4 నుంచి 10 లక్షలకు పెంచాలని, 41 ఏసీఆర్‌పీసీ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నూతనంగా ఏర్పడిన జిల్లా కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లా అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా విద్యాసాగర్, అధ్యక్షుడిగా కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పార్థసారథి, కోశాధికారిగా వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్ ఆజాద్, వనగంటి నాగేశ్వర్‌రావు, సీహెచ్ శైల, శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శులుగా రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రావు, కిషన్, ఇస్మాయిల్ అహ్మద్, మోత్కూరు వనజ, ప్రత్యేక ఆహ్వానితుడిగా నాగారం అంజయ్య, సభ్యుడిగా మామిడి వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు.


విద్యాసాగర్ (గౌరవాధ్యక్షుడు)


సత్యనారాయణ (అధ్యక్షుడు)


పార్థసారథి(ప్రధాన కార్యదర్శి)

# జానారెడ్డికి షాక్

- ఆయన స్వగ్రామం అనుముల నుంచి 40 కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, జూన్ 19 : మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డికి సోమవారం తన సొంతూరి ప్రజలు షాక్ ఇచ్చారు. గత 40 ఏండ్లుగా తన రాజకీయ ఎదుగుదలకు అండదండగా ఉన్న అనుముల గ్రామస్తులు హాలియా మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన 40 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ 2018కి ముందు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన ప్రతి ఎన్నికలో కూడా జానారెడ్డి రిగ్గింగ్‌తోనే గెలిచాడే తప్ప.. ప్రజాబలంతో గెలువలేదని ఆరోపించారు. గత పాలకులు హాలియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాజకీయం చేసేవారని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ పాలనలో హాలియాలో ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో నేడు సుమారు 27 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డ్, డిజిటల్ లైబ్రరీ, ఆడిటోరియం నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, ఎడమ కాల్వ మాజీ చైర్మన్ మల్గిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు చేరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ ప్రసాద్‌నాయక్, కౌన్సిల్ సభ్యులు రావుల లింగమ్మ, మార్కెట్ డైరెక్టర్ సురబి రాంబాబు, దోరేపల్లి వెంకన్న, దుర్గారావు, జినకల ప్రసాద్, జానపాటి శ్రీనివాస్, బొడ్డుపల్లి ఈదయ్య, మహేశ్ పాల్గొన్నారు.


అడ్డగూడూరు : సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

# తెలంగాణకు హరితహారం గొప్ప కార్యక్రమం

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్

అడ్డగూడూరు,జూన్ 19 : 70 ఏండ్ల పరాయి పాలనలో ధ్వంసమైన పర్యావరణానికి తెలంగాణ హరితహారం గొప్ప వరమని, భవిష్యత్ తరాలకు ఆస్తులు ఇవ్వడమే కాకుండా, మంచి ఆహ్లాదకరమైన వాతవరణం ఇవ్వాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో జరిగిన హరితోత్సవంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో జిల్లా వ్యాప్తంగా నాటిన 4.81 కోట్ల మొక్కలు చెట్లుగా మారి ఆక్సిజన్‌తోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయన్నారు. హరితహారం కార్యక్రమంతో మొక్కలు నాటాలనే ఆలోచన సీఎం కేసీఆర్‌కు తప్ప దేశంలోనే ఏ ఒక్కరికీ రాలేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ లేకుంటే భవిష్యత్‌లో ఆక్సిజన్ డబ్బాలు కొనుక్కోవాల్సిన పరిస్థితి అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం మిషన్‌భగీరథ పథకం పెట్టి ప్రతి ఇంటికీ కృష్ణాజలాలు అందిస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లలో అన్ని రకాల లవణాలు ఉన్నట్లు చెప్పారు. తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధితో ప్రజలు నేడు ఎంతో సంతోషంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి ఎక్కడ అని కొంతమంది అనడం హాస్యాస్పదమన్నారు. 70 ఏండ్లు అధికారం ఇస్తే ఈ జిల్లాను నాశనం చేసిందని ఎవరో ప్రజలకు తెలియదా? అని ప్రశ్నించారు. వాళ్లు చేసిన పాపంతోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఈ పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అనంతరం అడ్డగూడూరు, మోత్కూరు మండలాల మహిళా సంఘాల సభ్యులకు రూ.2.42కోట్ల రుణాల చెక్కును పంపిణీ చేశారు. అంతకుముందు హరితోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని ఎడమ సంజీవరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 5.10 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల నాటింపును కలెక్టర్ పమేలా సత్పతి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. హరితహారం వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

### గోదావరి జలాలతో సస్యశ్యామలం : ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

గోదావరి జలాలతో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు త్వరలోనే సస్యశ్యామలం కానున్నట్లు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ అన్నారు. దేశంలోని ఇతర ఏ రాష్ట్రంలో కూడా కల్యాణలక్ష్మి పథకం, 24 గంటల ఉచిత విద్యుత్ లేదని అన్నారు. గతంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు కలిపి 4 వేల ఎకరాలు మాత్రమే సాగయ్యేదని, ఇప్పుడు అడ్డగూడూరు మండలంలోనే 11 వేల ఎకరాలు సాగవుతున్నట్లు తెలిపారు. అడ్డగూడూరు మండలాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.20 కోట్లతో మానాయికుంట బ్రిడ్జి నిర్మించినట్లు చెప్పారు. అడ్డగూడూరు నుంచి లక్ష్మీదేవికాల్వ వరకు బీటీ రోడ్డు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. త్వరలోనే అడ్డగూడూరు నుంచి చౌళ్లరామారం బీటీ రోడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి అన్నపూర్ణ, ఆయిల్‌పామ్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్, ఎంపీడీఓ చంద్రమౌళి, తాసీల్దార్ దశరథనాయక్, ఎంపీపీ దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, సింగిల్‌విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, వైస్ ఎంపీపీ దైద పురుషోత్తంరెడ్డి, మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రీ మేఘారెడ్డి, మోత్కూరు జడ్పీటీసీ గోరుపల్లి శారద తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చేసే బీఆర్‌ఎస్‌లో చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

శాలిగౌరారం, జూన్ 19 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 16 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కొత్త, పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొన్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కొల్లు సత్తిరెడ్డి, దావీద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.